నెలలవికావు కలలు!

ఉదయం లేచింది మొదలు ఒకటే హడావిడిపడుతూంది పార్వతి-పన్నెండు గంట లోపల అమ్మ రాదేమోనని.

"ఆవిడ రాకపోతే నే చూసుకుంటా లేవోయ్. ఏమిటా ఖంగారు!" గడ్డం గీసుకుంటూ అడిగాడు కృష్ణమూర్తి.

"ఏంలేదు. ఈ రోజు మేం కలుసుకోకపోతే మళ్ళీ ఎప్పుడు కలుసు కుంటామో. రత్న ఊరికి వెళ్ళిపోతుంది. ఉమ సెలవులు కూడా అయిపోతాయి. బీరకాయలు చెక్కు-తీస్తూనే" అంది పార్వతి.

"పోనీ నువ్వు ఫ్రీగా ఉన్నావుగా! ఓ సారి ఆవిడనీ ఓ సారి యీవిడనీ చూసేసివద్దువుగాని" తేలికగా అన్న కృష్ణమూర్తిని కొరకొర చూసింది పార్వతి ఆమె చూపు తివ్వ కొనే లోపలసన్నగా కన్నుకొట్టి ఊరుకున్నాడు - కృష్ణమూర్తి.

"చూస్తున్నాంగా-యీ యింట్లో ఓ అరగంట ఎటైనా వెళ్ళిరావాలంటే ఎంత ప్లానింగుచేయాలో!" కోపంగానే అంది పార్వతి.

"అందుకే ప్లానింగో అంటే విన్నావా ఏమిటి నువ్వు? కాలెండరు పాపల్లాంటి పిల్లలో అంటూ ... మాట పూర్తి కానివ్వకుండా బాత్‌రూమ్ తలుపులు జేరవేసి చక్కా-పోయింది పార్వతి. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కి- ముఖం జేవురించింది. ఉదయం నుంచీ పొయ్యిదగ్గరే ఉండేమో ముఖం చిరుచెమటలతో తడిసి మెరుస్తూంది చీరకొంగుతో ముఖం అద్దుకుని కూరని పొయ్యెక్కించేపని ప్రారంభించి కృష్ణమూర్తి మాటలకి నవ్వుతుంది...

అప్పుడే వంట గదిలోకి వస్తూన్న కృష్ణమూర్తి, ఆ నవ్వుచూసి భార్య దగ్గిరకి చేరాడు.

"ఏమిటా జోకు? చెప్పు" అంటూ నిలదీశాడు-కృష్ణమూర్తి. టిఫిను ప్లేట్లో సర్ది బల్లమీద పెట్టింది.

"నువ్వు ఎందుకు నవ్వావో చెప్తేగాని టిఫిను ముట్టుకోను" భీష్మించాడు.

"ఏం లేదు. ఉట్టినే నే. ఏం నవ్వుకోకూడదా ఏం?" అంటూ ఎదురు ప్రశ్న వేసినా పార్వతి ముఖం వింతగా వెల్గుతూ దాగనంటూన్న ఏదో రహస్యాన్ని రహస్యంగానే తెలియ చేసేస్తూంది.

"చెప్తేనేనూ నవ్వుతానుగా? భర్తకి టిఫిను పెట్టి తుమ్మెల్లో పొద్దుకూకిన ముఖంతో భారతనారి పక్కన నిలబడాలని ఏ. కే. లా ఏనా రాసిందా ఏం కొంపతీసి!" అడిగాడు.

"మధ్యాహ్నం భోజనానికి వచ్చాక చెపుతానులే" అనేసింది పార్వతి.

"ఇందాకా షేవ్ చేసుకుంటూ ఉంటే నాకో ఆలో.

చన వచ్చింది పార్వతీ. ఇన్నేసి ఉత్తరాలు రాసుకుంటారు అవకాశం దొరికినప్పుడల్లా కలుసుకుంటారు. యీ పూట భోజనం ప్రోగ్రాం కోసం ఎందుకంత ఆత్ర పడుతున్నావో అన్నదే-ఆలోచన. చెప్పు, ఎందుకు? యీ భోజనానికి నీ యిప్పటి సగం స్వగతం నవ్వు కీ లింకు ఉంది – అవునా? సానునయంగా అడిగాడు కృష్ణమూర్తి.

"ఏం లేదు కృష్ణా-అసలు పిల్లలేవిటి నాన్సెన్స్-అనే ఉప ప్రసవించడానికి సిద్ధంగా ఉంది. వన్ మినిమమ్, టు మేక్సిమమ్-అనే కల్పకం మూడోసారి ముచ్చటగా కడువు తోంది సరికదా యీ సారి ఆడపిల్ల కావాలంటూ అందరి దేవుళ్ళకి మొక్కుతోంది. ఇదంతా జ్ఞాపకం వచ్చి..." పార్వతి మాటని మధ్యలోనే ఆపి.

"మరి నీసంగతి" అంటూ ఆమెని దగ్గిరకి తీసుకున్నాడు —కృష్ణమూర్తి.

"అది సాయంత్రం గాని..." అంటూ అతని కౌగిలి విడిపించుకుని వంటవిూదికి ధ్యాస మళ్ళించింది పార్వతి.

అమ్మ రావడం కృష్ణమూర్తి ఆఫీసుకు వెళ్ళడం ఒకే సారి జరిగాయి.

"సాయంత్రం త్వరగా వస్తాను. యుల్ బ్రయినర్ కత్తిపోటు సినిమాకి టిక్కెట్లుకూడా తెస్తాను. అక్కడే ఉండి పోకు" అంటూ పార్వతిని హెచ్చరించి మరీ వెళ్ళాడు. కృష్ణ మూర్తికి ఒక భయం ఉంది-పార్వతి స్నేహితురాళ్ళంటే. వాళ్ళు అలాంటివాళ్ళు. బొమ్మలచేతకూడా మాట్లాడించే రకాలు!

కృష్ణమూర్తిని సాగనంపి తల్లితో కబుర్లు చెపుతూ అద్దంముందు కూర్చుంది. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసు కుంటూంటే ఏమేమిటో జ్ఞాపకం రాసాగాయి పార్వతికి.

"అదేమిటే అలా పరధ్యానంగా కూర్చుండిపోయావు. త్వరగా తెమిలి వెళ్ళు" అంటూ వంటిల్లు సర్దుతూ హెచ్చ రించారు పార్వతి తల్లి.

"ఏం లేదమ్మా-ఉమ చదువుకునే రోజులకన్నా అం దంగా హుందాగా తయారైంది. కళ్ళుకూడా నిండుగా తీపిగా కన్పిస్తుంది. నేనుమటుకు ఇలా ఎందుకయ్యాను?" తనని తానే ప్రశ్నించుకున్నట్టు తల్లిని అడిగింది పార్వతి.

"పిచ్చి! నీకు మటుకు ఏం లోటు? చదువుకునే టప్పటి నీకూ, ఇప్పటి నీకూ ఏం తేడా లేదు; కావలిస్తే నీ స్నేహితు లనే అడుగు. కొంచెం బొద్దుగా తయారయ్యావు అంతేలేవే త్వరగా తెమిలి వెళ్లు నీవు వెళ్ళాక తలుపు తాళంవేసి బాబి గాన్ని స్కూలునుంచి తీసుకువస్తాను" అన్నదామె.

తన రహస్యం తల్లికి చెప్పాలా? అప్పుడే చెప్పకూడదా అన్న సందిగ్ధంలో పడిపోయిన పార్వతి యాంత్రికంగా అలంకరించుకుని చెప్పుల్లో కాళ్ళు దూర్చింది.

"అదేమిటే? ఎంతో సరదాగా వెళ్ళవలసినది—అలా దిగులుపడి వెడుతున్నావు? వెళ్ళి హాయిగా నాలుగ్గంటల దాకా వాళ్ళతో గడిపిరా," అంటూ కూతుర్ని సాగ నంపారు.

కల్పకం ఇంటికి అట్టే దూరంలేదు. అయినా రిక్షా ఎందుకని టాక్సీ ఆపి ఎక్కింది పార్వతి. అంతులేని ఆలోచ

నలు ఒక కొలికికి రాకముందే టాక్సీ కల్పకం యింటిముందు ఆగింది. వాణ్ణి పంపి గుమ్మంలో అడుగెట్టిందో లేదో- అమాంతం స్నేహితురాళ్ళిద్దరూ మీాద పడ్డారు— 'ఇంత లేటా?' అంటూ—'ఏదీ—తెమిలేసరికింత అయింది — లోపలికి రాని స్తారా?' అంటూ హాల్లోకి నడిచి కుర్చీలో కూలబడింది.

అది మొదలు కాలం స్తంభించిందో! రాకెట్ వేగంతో పయనించిందో - ఆ ముగ్గురిలో ఎవరూ గమనించే స్థితిలో లేరు, ఒకటే కబుర్లు, ఒకటే నవ్వులు, ఒకటే గోల.

ఆఖరికి కల్పకం అమ్మగారు అన్నారు.

"మీా పిచ్చికూలా, ఒకళ్ళ తరవాత ఒకళ్ళు మాట్లాడ కూడదర్రా." అంటూ.

"మీా కర్థం అవుతుందండీ," అంది కూర్చోలేకుండా అవస్థ పడుతున్న ఉమ. నిండుగా వర్షించాడానికి సిద్ధంగా వున్న మేఘంలాగా. పండినపండు చివరికొమ్మన వేలాడుతూ ఎప్పుడు రాలుతుందా — అన్నట్టు ఉంది ఉమ. అయినా అల సటగాని ఉత్సాహంలేమిగాని లేవు. అదీ చూడ ముచ్చటగా ఉన్న సంగతి.

"పిల్ల లేమిటి నాన్సెన్స్ అన్నావే?" అంటూ వేళా కోళం చేసింది పార్వతి.

"నాకేం తెలుసు నువ్వు నానిగాడిని, ఇచ్చి ఉంటే ఈ అవస్థ తప్పేది నాకు" అంది ఉమ. పిల్లలూ, ముచ్చట్లూ ప్రసవాలూ ఇవి తప్పించి వేరే మాటలే రావడంలేదు. మహావస్తే భర్తలగొడవ - ఆశ్చర్యం వేసింది పార్వతికి.

"కాలేజిలో హక్స్‌లీ, మొరావే అంటూ గోలగోల చేసే మేమేనా అలా మాట్లాడుతున్నది"- అనుకుంది.

"ఎప్పుడు వచ్చిన దగ్గిరనుంచి చూస్తున్నాను—ఏదోలా వున్నావ్?" కల్పకం పార్వతిని నిలదీసింది.

"అప్పుడే మూడు దాటుతోంది - నే వెళ్ళాలి." అంటూ లేవబోయింది పార్వతి.

"నే నడిగినదానికి బదులు చెప్తేగాని వెళ్ళనీయను." కూర్చోపెట్టేసింది కల్పకం.

"ఏం లేదే. మనం కాలేజీలో చదివేరోజుల్లో ఎలా మాట్లాడే వాళ్ళమో—ఇప్పుడూ అలాగే మాట్లాడుతున్నాం- కాని వాటికీ ఇప్పటివాటికీ ఎంత తేడా?" అంది పార్వతి.

"మైగాడ్! అవును సుమా - ఉట్టి వెజిటబుల్స్‌లాగా తయారై పోయినట్టుంది. ఏం పార్వతీ!"

"అవునే. ఇంటలెక్చువల్ కంపెనీ లేకపోతే అలా తయారవక తప్పదు." అంది కల్పకం.

"ఇంటిదగ్గిర లేదు పోనీ మనం కలిసి నప్పుడేనా ఏం మాట్లాడాం?" అంది పార్వతి.

"అదా - ఆలోచిస్తున్నావు" నీకేం? హాయిగా పిల్లలిద్దరూ స్కూలుకి వెళ్ళిపోతారు. ఆయన ఆఫీసు, ఇంట్లో కూర్చుని మెదడుకి పదును పెడ్తూ ఉంటావు" అంది కల్పకం.

పేలవంగా నవ్వింది పార్వతి. తన సంగతి చెప్తే నవ్వుతారేమో అని భయం ఒకపక్క; చెప్పకుండా ఎలా? అని ఓ పక్క——

"నే వెళ్ళేముందో వార్త చెప్పి వెళ్లాలి కప్పూ! ఉష్-

నన్నూ మీ జాబితాలో చేర్చండి" అంటూ నిలబడి చీర సర్దుకుంది.

ఓ క్షణం పట్టింది పార్వతి మాటలు అర్థం చేసుకుందుకు-స్నేహితురాళ్ళిద్దరికీ.

"మైగాడ్! ఇంత మంచివార్త ఎలా దాచగలిగావు పార్వతీ?" అంటూ ఉమ అమాంతం కౌగలించుకుంది. కల్పకం మళ్ళీ కూర్చొని పెట్టేసింది.

"మీరు నవ్వుతారేమోనని భయం వేసింది." అంది నెమ్మదిగా.

"నవ్వడమా? ఎందుకూ?" అర్థం కాలేదు కల్పకానికి.

"మనం ఎంతెంత ఆదర్శాలు వల్లించే వాళ్ళమే. నా మటుకు నేను..." నసిగింది పార్వతి. సిగ్గుతో ఆమెముఖం కందిపోయింది. "సిల్లీగా ఆలోచిస్తావేంటి పార్వతీ? కాలేజీ జీవితానికి దీనికి సంబంధం ఏవిటి? దానిదారి దానిది దీనిదారి దీంది" కొట్టి పారేసింది కల్పకం.

"అదికాదే - ఇద్దరతో చాలనీ, మళ్ళీ చదివి - ఇంకా చదివి..."

"అఘోరించావులే. ఇటువంటి ఎదురుచూడని తీయని సంఘటనలే వాయిమనిపిస్తాయి." అంటూ యీ సువార్త చెప్పడానికి లోపలికి వెళ్ళింది కల్పకం.

"అయితే ఈసారి అమ్మాయి తప్పదు" అంది ఉమ.

"చూడాలిమరి- నాకెంత పిరికితనం తోచిందో తెలుసా ఉమా? మీరు నన్ను వేళాకోళం చేస్తారనీ. ఓ ఆట పట్టిస్తారనీ భయపడ్డాను" అంది.

"ఆటపట్టించడానికి నీ లోభం ఏమిటి పార్వతీ? ప్రసవ వేదన కష్టం తల్చుకున్నప్పు డెందుకొచ్చిన పీడ ఇది అని పించినా నీ పిల్లల్ని చూసి – అది మరిచిపోతున్నాను నేను. అలాంటిది నువ్వు కనీ బాధపడికూడా మాతృత్వం అమృతంలాగా స్వీకరిస్తున్నావు. కుచేలసంతతి వద్దుగాని ముచ్చటగా ముగ్గురుండడానికేం?" పార్వతి భుజంమీద చెయ్యివేసి కూర్చుంది ఉష.

మిఠాయి, రవికెలబట్టా, పళ్ళూ తాంబులము పెట్టి కల్పకం తల్లి తాంబులం అందించారు.

"మళ్ళీ ఉషకు పుట్టబోయే పాపకి పేరు పెట్టినప్పుడు అది పిలుస్తే కలిసి ప్రోగ్రెస్ చర్చిద్దాంలే పార్వతీ – ఈలోగా చిన్న చొక్కాలుమట్టుకు నేను కుట్టాలి–" అంటూ స్నేహితురాల్ని సాగనంపి కల్పకం, ఉషని కూడా అదే టాక్సీలో ఎక్కించి దారిలో దింపి, పార్వతి ఇల్లు చేరేసరికి ఐదుగంటలు దాటిపోయింది.

హాల్లో కూర్చుని పేపర్లు తిరగేస్తున్న కృష్ణమూర్తి పార్వతి రాకతో పేపరు టేబిలుమీద పడేసి లేచాడు.

"నే చెప్పలేదూ - వీరా ముగ్గురూ చేరితే అంతే" అన్నాడు నవ్వుతూ.

"అవునే అమ్మాయి! సినిమా కన్నాడుటగా-త్వరగా రాక పోయావూ" నిష్ఠురంగా అన్నారు పార్వతి తల్లి.

"లేదమ్మా - ఆకబురూ ఈకబురుతో ఆలస్యం అయిపోయింది ఈరోజు ఎక్కడికి కదలలేను కృష్ణా!" అంది దీనంగా.

"పోనీలేవోయ్; మళ్ళీ ఆదివారం వెడదాం. నేను

అత్తయ్యని దింపేసి వస్తాను—" అన్నాడు కృష్ణమూర్తి.
"అమ్మయ్య !" అనుకుంది పార్వతి.

ఆరాత్రి పిల్లలు నిద్రపోయాక కృష్ణమూర్తి కౌగిట సర్దుకుంటూ అంది "మేం ముగ్గురం ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం-కృష్ణా" అని.

"అంటే" ముఖంమీద పడుతున్న జుట్టు సవరిస్తూ అడిగాడు - కృష్ణమూర్తి.

"అంటే అంతేమరి! కల్పకానికి ఆరో నెల. ఉమ నేడో రేపో - అంటూంది. నేనేమో."

"అమ్మదొంగా చెప్పలేదేం? అలాంటివి నాకు కదా ముందు చెప్పాలి?" అంటూ పార్వతిని ఆవేశంతో ముద్దుపెట్టుకుని ఆనందం వెలిబుచ్చాడు.

"నీ కొత్తకారు ప్లాను తలక్రిందు లవుతుందని విసుక్కుంటావని చెప్పలేదు కృష్ణా - మళ్ళీ ఐదువేలు డిపాజిట్" నవ్వుతూనే అంది పార్వతి.

"ఈవేటి కికలు సృష్టించుకున్నాంగా! వచ్చేఏడు కొందాం కారు. మరేం మునిగిపోలేదు- మనమేం ముసలాళ్ళమా ఏమిటి?" చిలిపిగా నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"వాళ్ళు నవ్వుతారేమో అని ఎంతో బెంగ అనిపించింది. నా ఆనందంకంటే వాళ్ళదే ఎక్కువగా తోచింది తరవాత. గుండెలమీంచి బరువు దించినట్టు అనిపించింది. అంతే కాదు—నాకూ ఇప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉంది." కృష్ణమూర్తి జుట్టు నిమురుతూ తనఊహాలు పైకి చెప్తూంది పార్వతి...

"అయితే వచ్చేవారం పెప్సెర్స్‌వద్దు అలాంటివి చూసే నానిగాడిలాంటి రాడీని కన్నావు. ఈ సారేనా? ప్రతివ్రతల కథలు చూద్దాం—సరేనా?" అంటూ బెడ్ లైట్ పెట్టడానికి లేచాడు కృష్ణమూర్తి.

"అయితే సినిమా చూడ్డమే పడదు" అంది పార్వతి నవ్వుతూ.

"ఏం?"

"రంభా ఊర్వశిల్లాంటి వారిపక్కనే శూర్పణఖల్ని తెచ్చి పెడతారుగా? అవీ ఇవీ విడిగా ఉండడం లేదుగా మరి ఎలా?" సర్దుకు పడుకుంటూ అడిగింది పార్వతి.

"అయితే పడుకోబోయేముందు కుమారీశతకం చదివి విన్పిస్తూఉంటాను" అన్నాడు కృష్ణమూర్తి చిలిపిగా.

"పోదూ! నువ్వూ మరీనీ!" అన్నది పార్వతి అలక నవ్వుతో.